

# మెగా అవకాశం

'అమిగోస్' 'నా సామిరంగ' చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు చేరువైంది కన్నడ భామ ఆషికా రంగనాథ్. తాజాగా ఈ అమ్మడు బంపరాఫర్‌ను సొంతం చేసుకుంది. చిరంజీవి కథానాయకుడిగా వశిష్ట దర్శకత్వంలో రూపొందిస్తున్న సోషియో ఫాంటసీ చిత్రం 'విశ్వంభర'లో ఆషికా రంగనాథ్ కీలక పాత్రలో నటించనుంది. ఈ విషయాన్ని మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. మూడో సినిమాలోనే మెగాస్టార్‌తో కలిసి తెరను పంచుకోవడం అదృష్టమని ఆమె అభిమానులు భావిస్తున్నారు. 'విశ్వంభర' చిత్రంలో చిరంజీవి సరసన త్రిష కథానాయికగా నటిస్తున్నది. ఈ సినిమాలో ఐదుగురు నాయికలకు చోటుందని వార్తలు వినిపిస్తున్నాయి. చిరంజీవి కెరీర్‌లోనే భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. పంచభూతాల నేపథ్యంలో ఆధ్యాత్మిక, ఫాంటసీ అంశాల కలబోతగా విజువల్ ఫీస్ట్‌లా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రం సంక్రాంతి కానుకగా వచ్చే ఏడాది జనవరి 10న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ చిత్రానికి కెమెరా: చోటా కె నాయుడు, సంగీతం: ఎం.ఎం.కీరవాణి, నిర్మాణ సంస్థ: యు.వి.క్రియేషన్స్, నిర్మాతలు: విక్రమ్, వంశీ, ప్రమోద్, రచన-దర్శకత్వం: వశిష్ట.

# విజువల్ వండర్ 'కల్కి'



ప్రభాస్ కథానాయకుడిగా నాగ్‌అశ్విన్ దర్శకత్వంలో రూపొందిస్తున్న సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్ 'కల్కి 2898'లో అగ్ర నటుడు అమితాబ్ బచ్చన్ అశ్వత్థామ పాత్రను పోషిస్తున్న విషయం తెలిసిందే. 'కల్కి 2898' చిత్రం జూన్ 27న ప్రేక్షకుల ముందుకురానుంది. ప్రమోషన్‌లో భాగంగా ఈ చిత్రంలోని 'బుజ్జి' అనే వాహనాన్ని ఇటీవల పరిచయం చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో 'కల్కి 2898' చిత్రంపై అమితాబ్ బచ్చన్ ప్రశంసలు కురిపించారు. దర్శకుడు నాగ్‌అశ్విన్ సృజనాత్మకత, అద్భుత ఆలోచనాశక్తి తనను ఆశ్చర్యానికి గురిచేసిందని చెప్పారు. 'ఈ సినిమా షూటింగ్ చేస్తున్న సమయంలోనే భారీ విజయం తథ్యమనే భావన కలిగింది. ముఖ్యంగా కొన్ని సీన్స్ అద్భుతంగా అనిపించాయి. ఈ సినిమాను ప్రతి ఒక్కరూ ప్రశంసిస్తున్నారు. ఇక బుజ్జి పాత్ర సినిమాలో మరో అద్భుతం' అని అమితాబ్ బచ్చన్ పేర్కొన్నారు. 'కల్కి ' షూటింగ్‌లో పాల్గొన్న నాటి నుంచి సినిమాపై అమితాబ్‌బచ్చన్ ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. కమల్‌హాసన్, దీపికా పడుకోన్, దుల్కర్ సల్మాన్, దిశాపటానీ ఈ సినిమాలో కీలక పాత్రలను పోషిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదల చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి.



# 'ఫిదా' కాంబినేషన్ రిపీట్

శేఖర్ కమ్ముల దర్శకత్వంలో వరుణ్‌తేజ్, సాయి పల్లవి జంటగా నటించిన 'ఫిదా' చిత్రం చక్కటి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా మెప్పించింది. తెలంగాణ గ్రామీణ నేపథ్యంలో నేటివిటీకి పట్టం కడుతూ అందరిని ఆకట్టుకుంది. వరుణ్‌తేజ్ కెరీర్‌లోనే ఉత్తమ చిత్రంగా నిలిచిపోయింది. తాజాగా ఈ కాంబినేషన్ మరోమారు రిపీట్ కానుందని సమాచారం. ప్రస్తుతం శేఖర్ కమ్ముల 'కుబేర', వరుణ్‌తేజ్ 'మట్కా' చిత్రాలతో బిజీగా ఉన్నారు. ఈ రెండు ప్రాజెక్ట్‌లు పూర్తయిన వెంటనే వీరి కాంబినేషన్‌లో సినిమా పట్టాలెక్కనుందని తెలుస్తున్నది. వరుణ్‌తేజ్‌ను దృష్టిలో పెట్టుకొని శేఖర్ కమ్ముల 'ఫిదా' తరహాలోనే క్లీన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ కథను సిద్ధం చేశారని, కథ బాగా నచ్చడంతో వరుణ్‌తేజ్ ఈ ప్రాజెక్ట్‌కు వెంటనే ఓకే చెప్పారని అంటున్నారు. ఓ ప్రముఖ నిర్మాణ సంస్థ ఈ చిత్రాన్ని తెరకెక్కించనుందని సమాచారం.

# 27 ఏళ్ల తర్వాత..






**ప్రభుదేవా, కాజోల్** కాంబినేషన్ అనగానే 'మెరుపు కలలు' (1997) చిత్రంలోని 'వెన్నెలవే వెన్నెలవే' అనే పాట గుర్తుకొస్తుంది. ఆ రోజుల్లో యువతరాన్ని ఆమితంగా ఆకట్టుకుంది ఆ పాట. 'మెరుపు కలలు' సినిమా తర్వాత ప్రభుదేవా, కాజోల్ కలిసి నటించలేదు. దాదాపు 27 ఏళ్ల తర్వాత ఈ అగ్ర తారలిద్దరూ ఓ సినిమాలో నటిస్తుండటం విశేషం. వివరాల్లోకి వెళితే... తెలుగు యువకుడు చరణ్ తేజ్ ఉప్పలపాటి దర్శకత్వంలో కాజోల్, ప్రభుదేవా ప్రధాన పాత్రల్లో ఓ బాలీవుడ్ చిత్రం తెరకెక్కుతున్నది. యాక్షన్ థ్రిల్లర్‌గా భారీ బడ్జెట్‌తో తెరకెక్కిస్తున్న ఈ సినిమాలో నసీరుద్దీన్‌షా, జిషుసేన్ గుప్తా, సంయుక్త మీనన్ ఇతర ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు. ఫస్ట్ షెడ్యూల్ పూర్తయింది. త్వరలో టీజర్‌ను విడుదల చేయబోతున్నారు. సుదీర్ఘ విరామం తర్వాత ప్రభుదేవా-కాజోల్ జోడీ వెండితెరపై సందడి చేయబోతుండటం విశేషంగా చెప్పుకుంటున్నారు. కాజోల్ ప్రస్తుతం హిందీలో 'మా' అనే చిత్రంలో నటిస్తున్నది.

# యక్షిణి శాప విముక్తి కోసం



వేదిక, మంచు లక్ష్మీ, రాహుల్ విజయ్, అజయ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న వెబ్‌సిరీస్ 'యక్షిణి'. తేజ మార్ని దర్శకుడు. జూన్ 14 నుంచి తెలుగు, కన్నడ, తమిళ, మలయాళ, హిందీ భాషల్లో డిస్నీ హాట్‌స్టార్‌లో స్ట్రీమింగ్ కానుంది. శుక్రవారం ట్రైలర్‌ను విడుదల చేశారు. దర్శకుడు మాట్లాడుతూ 'సోషియో ఫాంటసీ కథాంశమిది. అలకాపురి అనే లోకం నుంచి ఒక శాపం వల్ల భూమ్మీదకు వచ్చిన యక్షిణి వంద మందిని చంపితేగానీ శాపవిముక్తురాలు కాదు. యక్షిణి వంద మందిని ఎలా చంపింది? వందో వ్యక్తి ఎవరన్నదే కథలో ఆసక్తికరంగా ఉంటుంది. హారర్‌తో పాటు థ్రిల్‌ను పంచుతుంది' అన్నారు. తన పాత్ర భావోద్వేగభరితంగా భిన్న కోణాల్లో సాగుతుందని కథానాయిక వేదిక చెప్పింది. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు. ఆర్కా మీడియా వర్క్స్ పతాకంపై శోభు యార్లగడ్డ, ప్రసాద్ దేవినేని ఈ సిరీస్‌ను నిర్మిస్తున్నారు.

# ఎమోషనల్ జర్నీ 'మనమే'



శర్వానంద్ కథానాయకుడిగా శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వంలో రూపొందిస్తున్న తాజా చిత్రం 'మనమే'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. కృతిశెట్టి కథానాయికగా నటిస్తున్నది. జూన్ 7న ప్రేక్షకుల ముందుకురానుంది. శుక్రవారం కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో శర్వానంద్ క్లాసీగా కనిపిస్తున్నారు. 'ఓ వైవిధ్యమైన కాన్సెప్ట్‌తో రూపొందిస్తున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఇది. కథలో చర్చించిన పాయింట్ అందరికి కనెక్ట్ అవుతుంది. వినోదం, భావోద్వేగాల కలబోతగా అన్ని వర్గాల వారిని ఆకట్టుకుంటుంది. శర్వానంద్ పాత్ర సరికొత్త పంథాలో సాగుతుంది. కథానుగుణంగానే టైటిల్ పెట్టాం' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: విష్ణుశర్మ, జ్ఞానశేఖర్ వీఎస్, సంగీతం: హేషమ్ అబ్దుల్ వహాబ్, సహ నిర్మాత: వివేక్ కూచిభొట్ల, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: శ్రీరామ్ ఆదిత్య.

# టైసన్ నాయుడు పోరాటాలు



బెల్లంకొండ సాయిశ్రీనివాస్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'టైసన్ నాయుడు'. సాగర్ కె చంద్ర దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని 14రీల్స్ సంస్థ నిర్మిస్తున్నది. శుక్రవారం నుంచి రాజస్థాన్‌లో కీలక షెడ్యూల్ మొదలైంది. స్టన్ శివ నేతృత్వంలో రాజస్థాన్ కోటలో భారీ పోరాట ఘట్టాలను తెరకెక్కించబోతున్నారు. పది రాత్రుల పాటు తెరకెక్కించే ఈ యాక్షన్ ఎపిసోడ్ సినిమాకు హైలైట్‌గా నిలుస్తుందని మేకర్స్ చెబుతున్నారు. బెల్లంకొండ శ్రీనివాస్ ఈ సినిమాలో పవర్‌ఫుల్ పోలీస్ పాత్రలో నటిస్తున్నారు. ఆయన గత చిత్రాలకు భిన్నంగా పూర్తి మాస్ అవతారంలో కనిపిస్తారని, యాక్షన్‌తో పాటు ఎమోషనల్ కంటెంట్‌తో ఈ సినిమా అందరిని ఆకట్టుకుంటుందని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: ముఖేష్ జ్ఞానేష్, అనిత్, సంగీతం: భీమ్స్ సిసిరోలియో, నిర్మాతలు: రామ్ ఆచంట, గోపీ ఆచంట, రచన-దర్శకత్వం: సాగర్ కె చంద్ర.

# కేన్స్ ఫెస్టివల్‌లో కేరళ చిత్రం

ఫ్రాన్స్‌లో జరుగుతున్న ప్రతిష్ఠాత్మక కేన్స్ ఫిల్మ్‌ఫెస్టివల్‌లో మలయాళీ చిత్రం 'ఆల్ వీ ఇమాజైన్ యాజ్ లైట్' పోటీలో నిలిచింది. దాదాపు మూడు దశాబ్దాల తర్వాత ఓ భారతీయ చిత్రం కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో పోటీలో నిలవడం విశేషం. కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లోని ముఖ్య విభాగమైన 'పామ్ డి ఓర్' అవార్డుల కేటగిరీలో ఈ సినిమా పోటీ పడుతున్నది. గురువారం ఈ చిత్రాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా చిత్ర బృందం రెడ్ కార్పెట్‌పై సందడి చేసింది. మానవీయ కథాంశంతో రూపొందిన ఈ చిత్రం అక్కడి ఆహుతుల్ని విశేషంగా ఆకట్టుకుంది. కేరళకు చెందిన ఇద్దరు నర్సుల కథతో ఈ సినిమాను తెరకెక్కించారు. పాయల్ కపాడియా దర్శకత్వం వహించారు. ముంబయిలోని ఓ నర్సింగ్ హోమ్‌లో పనిచేసే ఇద్దరు నర్సులు తమ వృత్తి జీవితంలో ఎదుర్కొన్న ఇబ్బందులను ఈ సినిమాలో ఆవిష్కరించారు. ఓ రోడ్‌ట్రిప్‌కు వెళ్లిన వారిద్దరు అనుకోకుండా ఓ అడవిలో చిక్కుకుపోవడం, ఆ తర్వాత జరిగే ఉత్కంఠభరిత పరిణామాల నేపథ్యంలో ఈ సినిమాను తెరకెక్కించారు. 'పామ్ డి ఓర్' కేటగిరీలో పలు అంతర్జాతీయ చిత్రాలు పోటీ పడుతున్నాయి. ఈ కాంపిటీషన్‌లో గెలుపొందే చిత్రాన్ని శనివారం ప్రకటించనున్నారు.







